## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే



**తాండూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గంలో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. తాండూరు నియోజకవ ర్గంలో మిషన్ భగీరథ పనులపై ఆరా తీశారు. తాండూరు ప్రాంతంలో మిషన్ భగీరథ పనులు ఇంకా ఎక్కడ మిగిలి ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం సమీపిస్తుండ టంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్వోల జిల్లా కమిటి సభ్యులు

**మేడ్చల్, ఫిబ్రవరి 23. ప్రభాతవార్త :** గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేయడంలో వీఆర్వోలను ఆప్షన్ పద్ధతిలో తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిద శాఖలో పనిచేస్తున్న వీఆ ర్వోల జిల్లా కమిటి సభ్యులు శుక్రవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆప్షన్ పద్ధతిలో వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తిరిగి తీసుకోవాలని, సర్వీస్ ప్రొటక్షన్, పే ప్రొటెక్షన్ కల్పిం చాల ని, కామన్ సినియార్టీ ద్వారా పదోన్నతులు కల్పించాలని వినతిలో కోరారు. నేడు రాష్ట్ర ప్రభుత్వంతో జరుగునున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మా న్యాయమైన దీర్ఘకా లిక సమస్యలను, మాకు జరిగిన నష్టాన్ని దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేయాలని ఈ సందర్బంగా కోరారు. వీఆర్వోల జిల్లా కమిటి సభ్య లు సత్తయ్య, ప్రకాష్, యాదయ్య, యాదగిరి, శ్రీనివాస్, రాములు, భాస్కర్, వెంకట్ పాల్గొన్నారు.



మంగళపల్లి మహమ్మాయి దేవి ఆలయం

## మంగళపల్లి మహమ్మాయి దేవి జాతరకు సర్వం సిద్ధం

**-ప్రారంభమైన మంగళపల్లి మహమ్మాయి దేవి జాతర**
**-అధిక సంఖ్యలో పోటెత్తుతున్న భక్తులు**

**ఆదిభట్ల ఫిబ్రవరి23,ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల మున్సిపాలిటీలో గల మంగళపల్లి గ్రామంలో మహమ్మాయి దేవి జాతర ఈ శుక్రవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో జరిగే ఈ జాతరకు పూర్వం నుంచి ఎంతో ప్రత్యేకత ఉంది.మొత్తంగా వారం రోజులు పాటు జరిగే ఈ జాతరలో ప్రతి రోజు ఒక ప్రత్యేక కార్యక్రమంతో పూజలు జరుగుతూ ఉంటాయి.గుడిలో మహమ్మాయి దేవి కళ్యాణ రథోత్సవంతో పాటు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పూజలు కూడా వైభవంగా జరుగుతాయి. ఈ వారం రోజులు వరుసగా అంకూరార్చన, ధ్వజరోహరణ,కళ్యాణ మహోత్సవం,రథోత్సవం, త్రిశూలోత్సవం,చక్రస్నానం,దీపోత్సవం వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.పూర్వం నిజాం కాలం నుంచి జరుగుతున్న ఈ జాతరకు ప్రతి ఏటా భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతుంటారు.ప్రతి రోజు స్వామివారికి రుద్రాబిషేకం ,దేవికి కుంకుమార్చనలు,పూజలు ,సేవలు ,అభిషేకాలు ,మహా నేవైద్యం ,అర్చనలు,హారతీ ఆరాధనలు పూజారులచే ఘనంగా జరుగుతుంటాయి.అలాగే ప్రతి రోజు జానపద కళాకారుల చేత కార్యక్రమాలు మరియు ఒగ్గు కథలను ప్రదర్శిస్తుంటాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గుడి యాజామాన్యం ముందస్తు చర్యలు తీసుకుంటూ గుడిని అందంగా అలంకరించమని ఆలయ కమిటీ చైర్మన్ చనమోని శ్రీనివాస్ తెలిపారు.

**ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహణ**

మంగళపల్లి మహమ్మాయి దేవి జాతరలో భాగంగా వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు.

## నూతన ఆవిష్కరణలు, కొత్త విషయాలను అన్వేశించాలి

**మానసిక, శారీరక ఆరోగ్యంతోనే కృషి ఫలితాలు: చౌహాన్**




మాట్లాడుతున్న ప్రకాష్‌చౌహాన్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఆసక్తి ప్రదర్శించాలని జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (ఎన్ఆర్ఎస్‌సీ) సంచాలకులు డాక్టర్ ప్రకాష్‌చౌహాన్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం దక్ష 3.0 ప్రారంభమయ్యింది. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎన్ఆర్ఎస్‌సీ సంచాకులు ప్రకాష్‌చౌహాన్‌తో పాటు గౌరవ అతిధిగా కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ డెలివరీ పార్టనర్ ఎంగేజ్‌మెంట్ సీనియర్ డైరక్టర్ చింతా సుబ్రమణ్యంలు విచ్చేసి ఫెస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈవెంట్లను ప్రారంభి వివిధ ప్రదర్శన శాలలను వారు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. 450 మంది నిర్వహాకులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో దేశంలోని తొమ్మిది రాష్ట్రాల నుంచి 120 కళాశాలలకు చెందిన దాదాపు 12,000 మంది విద్యార్థులు, 175కిపైగా ఈవెంట్లలో పాల్గొంటున్నారు. ఎన్ఆర్ఎస్‌సీ సంచాలకులు ప్రకాష్‌చౌహాన్ మాట్లాడుతూ ఈవెంట్లతో పాల్గొనడం ద్వారా విభిన్న అవకాశాలను అన్వేశించడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం లేకుండా విద్య, ఇతర కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని రోజుకు 8 గంటల నిద్ర అవసరమన్నారు. నేటి ఆధునిక టెక్నాలజీ యుగంలో డిజిటల్ పరికరాల వినియోగం పెరిగిపోతుందని, శారీరక శ్రమ, వ్యాయాయం లేకుండా పోతుందన్నారు. విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకోవడానికి క్రమశిక్షణతో పట్టుదలతో శ్రద్ధగా పనిచేయాలన్నారు. చంద్రుని ఉపరితల కూర్పు మ్యాపింగ్ కోసం చంద్రయాన్-2, చంద్రయాన్-1 వంటి భారతీయ ప్లానెటరీ మిషన్ల కోసం హైపర్‌స్పెక్ట్రల్ ఉపగ్రహ డేటాను ఉపయోగించడంలో ఆయన కీలకపాత్ర పోషించి చంద్రయాన్-2 మిషన్‌లోని ఇన్‌ఫ్రారెడ్ ఇమేజింగ్ స్పెక్ట్రోమీటర్ (ఐఐఆర్ఎస్) పరికరానికి ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారని పేర్కొన్నారు. కాగ్నిజెంట్ సీనియర్ డైరక్టర్ చింతా సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో కొత్త విషయాలను అన్వేశించడానికి, తప్పులు చేయడానికి వాటి నుంచి నేర్చు కునేందుకు బిన్నమైన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. దక్ష 3.0తో ఏయూ ప్రాంగణమంతా వివిధ స్టాల్స్‌తో పోటీల నిర్వహణ విద్యార్థులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అతిధులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏయూ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బాలాజీ ఉట్ల, డీన్ డాక్టర్ వి.విజయ్‌కుమార్, స్ట్రాటజీ అండ్ డిజిటల్ లెర్నింగ్ డైరక్టర్ అనురాగ్ పల్లా, కార్యక్రమ కన్వీనర్లు పి. రాజశేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ స్వప్న, బి.రవీందర్‌రెడ్డితో పాటు పలు విభాగాల డీన్లు ముత్తారెడ్డి, వసుధభక్షి, శ్రీనివాస్‌రావు, విష్ణమూర్తి, సత్యనారాయణ, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తూరులో.. ఇష్టారాజ్యంగా ఆర్ఎంపీల వైద్యం



**కొత్తూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** అమాయక రోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ వైద్యులు. రోగం ఒకటి వస్తే వైద్యం ఒకటి చేసి వారి ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. పెట్టేది ఫస్ట్ ఎయిడ్ సెంటర్ కానీ చికిత్స చేసేది అన్ని రోగాలకు. నిబంధనల ప్రకారం.... కేవలం చిన్నచిన్న గాయాలు, జ్వరం వస్తే కొన్ని మాత్రలు ఇచ్చి పంపాల్సి ఉంటుంది. కానీ వారు చేసే చికిత్సలు చూస్తే సామాన్యుల కళ్లు తిరుగుతాయి. వాడు వాడే మందులు ఎప్పుడు ఎక్స్పైర్ అయి ఉంటాయి. అయినా జిల్లా వైద్యాధికారులు చోద్యం చూస్తున్నారు. కొత్తూర్ పురపాలికతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్ఎంపీ డాక్టర్లు తమ పరిమితిని మించి వైద్యం చేస్తున్నారు. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ ఎంతమంది అమాయక ప్రజల ప్రాణాలను పొగొట్టారు. ఇష్టానుసారంగా చికిత్సలు చేసి దండిగా డబ్బులు వసూలు చేస్తూ వారికి ఏ చిన్న రోగం వచ్చిన భయ బ్రాంతులకు గురిచేసి దండిగా పైసలు వసూలు చేస్తున్నారు. రోగులకు ఆర్ఎంపీ డాక్టర్ల పరిమితి ఫస్ట్ ఎయిడ్ చికిత్స మాత్రమే చేయాలి, ఒకవేళ మేజర్ ప్రాబ్లం ఉంటే వెంటనే ఎంబీబీఎస్ డాక్టర్‌ను సంప్రదించాలని రోగులకు సలహాలు ఇవ్వాలి. కానీ ఆర్ఎంపీ డాక్టర్లు అమాయక ప్రజల ప్రాణాలు వారి చేతుల్లోకి

### సీజ్ చేసిన వారం రోజుల్లోనే రీఓపెన్ చేస్తున్న ఆర్ఎంపీలు
### చోద్యం చూస్తున్న వైద్యాధికారులు

తీసుకుని వారి పరిమితి మించి వైద్యం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరిగిన కూడా వైద్యాధికారులు మాత్రం అప్పటికి పూర్తి హల్‌చల్ చేసి ఆసుపత్రి సీజ్ చేశామని చెప్పి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆసుపత్రి ఓపెన్ చేసుకోవడానికి అనుమతులు ఇస్తున్నారు. గతంలో ఎంతోమంది ప్రాణాలు పోయినా చూసి చూడనట్టు వది లేస్తున్నారు. వైద్యాధికారులు ఆర్.ఎం.పీ ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులతో వైద్యం చేస్తుండగా రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుకున్న వైద్య అధికారులు నామ మాత్రం అప్పటికి పూర్తి ఆసుపత్రులను సీజ్ చేసి వారం రోజుల లోపలే వారి ఆసుపత్రి రీఓపెనింగ్‌కు అనుమతులు ఇస్తున్నారు. కాలం చెల్లిన మందులతో వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ వైద్యులను గతంలో డిప్యూటి డీఎంహెచ్‌వో రెడ్‌హ్యాడెండ్‌గా పట్టుకున్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదు. కానీ వారం రోజుల లోపల ఆసుపత్రిలు రీఓపెనింగ్ చేసుకున్నారు. వైద్యాధికారులు ఆర్ఎంపీలను ఇలా వదిలేయడం వళ్ల వాళ్లు ఇష్టం వచ్చినట్టు వైద్యం చేస్తూ అమాయక ప్రజల వద్ద దండిగా పైసలు వసూలు చేసి ప్రతి మెడికల్, ఆర్ఎంపీ డాక్టర్లు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు కళ్లు తెరిచి మెడికల్ షాపులు, ఆర్ఎంపీలపై దృష్టి వహించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.




సిఎం రెవంత్‌రెడ్డి రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

## సిఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

**మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి**

**చేవెళ్ళ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

ఈ నెల 27 చేవెళ్ళలో నిర్వహించే సిఎం రెవంత్‌రెడ్డి నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఫారా కళాశాల ప్రాంగణంలోని స్థలంను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన బీంభరత్‌తో కలిసి పరిశీలించారు. బహిరంగ సభ ప్రాంగణంను,ఏలిఫ్యాడ్ స్థలంను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమంను విజయవంతం చేయాలన్నారు.ప్రభేఉత్వ పథకాల అమలులో భాగంగా 500లకే గ్యాస్, 200 యూనిట్స్ ఉచిత విద్యుత్‌ను అందించే పథకాలను కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సిఎం రెవంత్‌రెడ్డిల చెతుల మిదుగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇఇ వెంకటేశ్వర్‌రావు, డిఆర్‌డిఓ పిడి శ్రీలత, చేవెళ్ల ఆర్డిఓ సాయిరాం, తహసీల్దార్ క్రిష్ణా, ఎంపిడిఓ హిమబిందు, ఆర్ఐలు రాజేష్, వినోద్, ఎసిపి కిషన్, సిఐ లక్ష్మారెడ్డి, విద్యుత్ ఎడి చంద్రశేఖర్, చేవెళ్ళ నియోజకవర్గ ఇంచార్జి పామెన బీంభరత్, చేవెళ్ల సహర సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల ఎంపిటిసిలు వసంతం, రాములు, మాజీ సర్పంచ్‌లు శైలజ,జనార్ధన్‌రెడ్డి, పడాల ప్రభాకర్, మండల పార్టీ అద్యక్షుడు వీరేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి,మహేశ్వర్‌రెడ్డి, మాసన్నగారి మాణిక్యరెడ్డి, పెంటయ్యగౌడ్, శ్రీనివవాస్‌గౌడ్,మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గోన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ స్థలంను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక,చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన బీంభరత్

## హరితహారం లక్ష్యాలను అధిగమించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ అధికారులకు సూచన**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి23,ప్రభాతవార్త :** జిల్లాలో హరితహారంలో భాగంగా లక్ష్యాలను అధిగమించేలా అధికారు లు పనిచేయాలి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని అదరనపు కలెక్టర్ తన ఛాంబర్లో తెలంగాణకు హరితహారం కార్యక్రమ కార్యచరణ ప్రణాళికపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... హరితహారంలో గత సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాలలో భాగంగా ఔషద మొక్కలు నాటేందుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.రోడ్లకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా పెద్ద పెద్ద మొక్కలు సిద్ధం చేసుకోవాలన్నారు.



అధికారుల సమావేశంలో చర్చిస్తున్న అదనపు కలెక్టర్

గ్రామాలలో ఖాళీ స్థలాన్ని గుర్తించి గ్రామపంచాయతీ లకు ఇచ్చిన లక్ష్యాలను అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.పొలాల గట్లపైన కూడా మొ క్కలు నాటాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో డిఎఫ్ ఓ జ్ఞానేశ్వర్, డిఆర్‌డిఓఏ శ్రీనివాస్,పరిశ్రమ శాఖ అధికారి వినయ్ కుమార్,పశుసంవర్ధక శాఖ అధికారి,డాక్టర్ అనిల్ కుమార్,వ్యవసాయ శాఖ అధికారి గోపాల్,జిల్లా గనుల శాఖ అధికారి సామెల్ జాకబ్ ఉద్యానవన శాఖ అధికారి అర్చన ,మున్సిపల్ కమిషనర్లు మహమ్మద్ జాకీర్,అహ్మద్, వెంకటయ్య, బలరాంనాయక్, విక్రమ్, సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఎదులాబాద్‌లో శుక్రవారం వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు అంబారీపేట అప్పలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజుల ఆధ్వర్యంలో స్వామి కళ్యాణం జరిపించారు. ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంపిటిసి గట్టగళ్ల రవి, వ్యవసాయశాఖ విశ్రాంత అధికారి కొండల విద్యాసాగర్‌రెడ్డి, సినీనటి రాగిణి, మాజీ సర్పంచ్ బట్టె శంకర్, మాజీ ఎంపిటిసి మంకం రవి, ప్రధానోపాధ్యాయులు కొమిరెడ్డి పాపిరెడ్డి, సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు గుండ్ల అంజనేయులు, నడిమింటి వెంకటేశ్, విశ్వనాధం పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు

**తెలంగాణ సిఐడి ఎడిజిపి శిఖా గోయల్**



మేడ్చల్ పిటిసిలో మహిళా కానిస్టేబుల్ శిక్షణార్థులతో తెలంగాణ సిఐడి ఎడిజిపి శిఖా గోయల్

**మేడ్చల్, ఫిబ్రవరి 23. ప్రభాతవార్త :** పోలీస్ శాఖను ఎంచుకున్న మహిళలు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ భాధ్యతలను కూడ సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలంగాణ సిఐడి ఎడిజిపి శిఖా గోయల్ అన్నారు, మేడ్చల్ మండలంలోని కండ్లకోయలో గల మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో తెలంగాణలోని 11 జిల్లాల నుంచి వచ్చి 422 మంది మహిళ ఏఆర్ కానిస్టేబుల్లకు శిక్షణా తరగతులను శుక్రవారం సిఐడి ఎడిజిపి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో చురుకుగా రాణిస్తు పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. పోలీస్ శాఖలో పని చేస్తున్న మహిళలు విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేస్తూ ఇంటి బా ధ్యతలను కూడ సక్రమంగా నెరవేరుస్తున్నారని అన్నారు. దేశ ప్రగతిలో కూడ పురుషులతో సమానంగా పాలుపంచుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో శారీరక, మానసిక దృడత్వాన్ని సాధించి, రాబోయే 30 సంవత్సరాలు సమాజానికి సమర్థవంత సేవ చేయాలని చెప్పారు. పోలీస్ కుటుంబంలోని అడుగిడబోతున్న మహిళా శిక్షణార్థులకు స్వాగతం పలుకి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పిటిసి ప్రిన్సిపల్ మధుకర్ స్వామి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## షరతులు లేని విశ్వాసానికి నిదర్శనం జాగిలాలు : డీజీపీ



ప్రదర్శనలు చేస్తున్న జాగిలాలు



ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేస్తున్న డీజీపీ రవిగుప్త

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మొయినాబాద్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** షరతులు లేని విశ్వాసానికి నిదర్శనం జాగిలాలు అని డీజీపీ రవిగుప్త అన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమి (ఐఐటిఏ)లో శుక్రవారం పోలీసు జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్ జరిగింది. కన్నుల పండువగా ఈ కార్యక్ర మంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జాగిలాలు ఆప్యాయతకు, విశ్వాసానికి ప్రతీకలుగా అభివర్ణించారు. పోలీసులు దర్యాప్తు చేసి చేదించిన కేసులలో జాగిలాల పాత్ర కీలకమన్నారు. ఎన్నో కేసుల దర్యాప్తులో జాగిలాలు నిందు తలను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించాయని తెలిపారు.పాసింగ్ అవుట్ పరేడ్‌లో జాగిలాలు కనబ రుస్తున్న ప్రతిభ, క్రమశిక్షణలను చూసి ముగ్దుడుం`య్యానని అన్నారు. ఐఐటిఏ అందిస్తున్న శిక్షణ దేశంలోనే ఎంతో పేరు తెచ్చిందని, వివిధ రాష్ట్రాల పోలీసు అధికారులు తమ రాష్ట్ర జాగిలాలకు శిక్షణ ఇప్పించాలని కోరుతున్నారని ఆయన తెలియజేశారు. ఇప్పటికే పలు రాష్ట్రాల జాగిలాలకు వివిధ రాష్ట్రాల జాగిలాలకు ఐఐటిఏ శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీవింగ్ సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఇటీవల జాతీయ స్థాయి డ్యూటి మీట్‌లో పథకాలు సాధించారని ప్రశంసించారు. ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పేరు తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ సాధించిన విజయాలలో పోలీస్ జాగిలాలు ప్రశంసాపూర్వక పాత్రను నిర్వహించాయని వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐఐటిఏ సిబ్బంది ఎంతో ప్రగతి సాధించిందని కొనియా డారు. ఐఐటిఏ కృషిని ఇతర రాష్ట్రాల పోలీస్ అధికారులు ప్రశంసించడంలో అతియోశక్తి లేదని,వారి శ్రమకు ఇది నిదర్శనమని అభివర్ణించారు. ప్రస్తుతం 21 జాగిలాలు 28 మంది కేనైన్ హ్యాండర్ల పాసింగ్ అవుట్ పరేడ్లో పాల్గొంటున్నట్లుగా తెలిపారు. ట్రాకర్, స్లిప్పర్, అస్టాల్,నార్కోటిక్ పిల్లలో శిక్షణ కొనసాగింద న్నారు. జాగిలాలలో లాబ్రడార్, జర్మన్ షెఫర్డ్, బెల్జియన్, మలినోయిస్ కాకర్ పానియల్ జాతులు ఉన్నాయన్నారు. 2004వ సంవత్సరంలో 11 జాగిలా లతో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం దాదాపు 771 జాగిలాలకు ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన జాగిలాలకు హండర్లకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం జాగిలాలు వివిద ప్రదర్శనలు ఇచ్చాయి. సెల్యూట్, ఫ్లవర్ బోకే డ్రిల్స్, ఒబిడియన్స్,రెఫ్యూజల్ ఆప్ పుడ్, లగేజ్ సెర్చ్,క్రాస్ వాక్, క్రైమ్ సీన్ డ్రిల్ తదితర ప్రదర్శనలు ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో యాంటి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య, ఐజీపీ,ఎండి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎం.రమేష్, ఆర్పిఎఫ్ ఐజిపి అరోనా ఠాకూర్, ఆర్పిఎస్ డిఐజి ఎస్. జెడ్‌ఖాన్, ఇంటలిజెన్స్ ఎస్పి భాస్కరన్, రాజేంద్రనగర్ డిసిపి సి.హెచ్ శ్రీనివాస్, ఐఐటిఏ ఇంచార్జి ప్రిన్సిపల్ అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం

-ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్‌నేత చింతా ప్రవీణ్‌కుమార్



రాహుల్‌గాంధీతో చింతా ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త: దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అత్యంత అవసరమని ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్ నేత చింతా ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈమేరకు శనివారం ఎర్రమంజిల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయత్వాన్ని బలపరిచేందుకు రాహుల్ గాంధీ నాయత్వంలో పనిచేసేందుకు నిర్ణయించుకుని ఇటీవల ఆయన్ను కలిసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత గతప్రభుత్వం పదేళ్ల కాలంలో తెలంగాణ ప్రజలను నష్టపరుస్తూ చేసిన అరాచకాలను గుర్తించిన ప్రజలు జాతీయ పార్టీకాంగ్రెస్‌ను బలపరిచి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి అవకాశం ఇచ్చారన్నారు. అలాగే జాతీయ స్థాయిలో బిజెపి పార్టీ అవలంభిస్తున్న విధానాలతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర కష్టనష్టాలకు గురై 60ఏళ్ల కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారన్నారు.దేశప్రధానిగా రాహుల్‌గాంధీ నాయత్వాన్ని బలపరుస్తూ తనతోపాటు దేశ ప్రజలందరూ ఎదురుచూస్తున్నాన్నారు. విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించినతానుసైతం వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

## 29న భవన నిర్మాణ కార్మికులు ఆందోళనలు

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: కే ంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 29న ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఫిబ్రవరి 1, 2 తేదీలలో జాతీయ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 29న దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఆందోళనలు చేపడతారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లను కే ంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా శంకర్ నియామకం

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మాల మహానాడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా చేపూరి శంకర్ నియమితులైనారు. ఈ మేరకు శుక్రవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తనను రంగారెడ్డి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడిగా నియమించిన జి.చెన్నయ్యకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో మాల మహానాడు పటిష్టత కోసం కృషి చేస్తానని, అన్నదమ్ములుగా మాల, మాదిగల మధ్య కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిచ్చుపెట్టి విడదీయాలని కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. జి.చెన్నయ్య మాట్లాడుతూ వర్గీకరణకు బిజెపి స్వస్తి చెప్పకపోతే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రాజేష్, శ్రీనివాస్, రమేష్, చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జన్నత్ హుస్సేన్ మృతికి సంతాపం తెలిపిన పద్మారావు

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: నీతి నిజాయితీకి, మానవతా దృక్పథానికి పేరుగాంచిన సీనియర్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ ఆకస్మికంగా మరణించడం పట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఎపి రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. హుస్సేన్ మంచి పరిపాలనాదక్షుడని, వివాదస్పద ఐఎఎస్ అధికారని ఆయన కొనియాడారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎపి అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆనేక సార్లు హుస్సేన్‌ను కలవడం జరిగిందన్నారు. ఆనేక పదవులు అలంకరించి రాష్ట్ర ప్రజలకు విశేషమైన సేవలు అందించిన జన్నత్ హుసేన్ తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పద్మారావు సానుభూతి తెలియజేశారు.

## గానగంధర్వ ఘంటసాల పాట చిరస్థాయిగా నిలిచి ఉంటుంది

- కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు



కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజును సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: తెలుగు జాతి ఉన్నంత కాలం గానగంధర్వ ఘంటసాల పాట చిరస్థాయిగా నిలిచి ఉంటుందని వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. శోభా ఇంటర్నేషనల్ అకాడమి అధినేత్రి శోభారాణి ఆధ్వర్యంలో 'సుస్వరాల సుగంధం-మధుర గీతాల మరందం' పేరుతో గాన కార్యక్రమం శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకటదీక్షితులు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు హాజరై ప్రసంగించారు. గాయనీ శోభారాణి నేతృత్వంలో గాన కార్యక్రమంలో శతాబ్ది గాయకులు, ఘంటసాల పుస్తక సంకలనకర్త చల్లా సుబ్బారాయుడు, ఘంటసాల గళామృతం పుస్తక సంకలనకర్త డాక్టర్ కొల్లూరి భాస్కరావు, బాలకామేశ్వరరావు, చింతలపాటి సురేశ్, అంబాళం శ్రీకాంత్, వేటూరి రమాదేవి,అఖిల, దుర్గాసౌజన్య, శ్యామల తదితరులు పాడిన పాటలు అందరిని మంత్రముగ్దులను చేశాయి.

## విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



బీజేపి విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గం కన్వీనర్ శ్రీకర్‌రావు,బీజేపి జిల్లా సెక్రటరీ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త : విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను నియోజక వర్గం అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆవిష్కరించారు. ఈ యాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపి జిల్లా సెక్రటరీ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, ఓబీసి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మల్లేష్, నాగరాజు, ఓబిసి కన్వీనర్ వినోద్ కుమార్, ఓబీసి కో కన్వీనర్ సతీష్, కమ్మరి రామకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## హర్యానా పోలీసులు యువరైతును పొట్టను పెట్టుకున్నారు

-సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఖండన

-స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్ పాండే

సైఫాబాద్, ఫిబ్రవరి23 ప్రభాతవార్త: హర్యానాకు చెందిన ఫాసిస్టు పోలీసులు పంజాబ్-హర్యానా రాష్ట్రాల సరిహద్దులో యువరైతు శుభకరన్‌సింగ్‌ను కాల్పుల్లో పొట్టన పెట్టుకున్నారని ఆరోపిస్తూ ఈ నరహంతక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటి ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ రాష్ట్ర పార్టీ రాష్ట్ర కమిటి సహాయ కార్యదర్శి ఎర్ర రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్ పాండే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం రైతులు శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేపడితే బరితెగించిన పోలీసులు కాల్పులకు తెగబడ్డారని, పోలీసులను తక్షణమే హత్యానేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్ రంగ ప్రైవేటికరణను నిలుపుదల చేయాలని, కౌలు రైతులకు తగిన రక్షణ కల్పించాలని మూడు వ్యవసాయ సాగుచట్టాలను బేసిక్‌గా ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఢిల్లీ కేంద్రంగా సాగిన చారిత్రాత్మకమైన రైతాంగ పోరాటంలో మరణించిన 750మంది రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై అమానుషంగా కాల్పులు చేయడం ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మతతత్వ విధానాలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.ఝాన్సీ సుభద్రారెడ్డి, గోపాల్, పతంగి, డి.వి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

## తెల్లఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ప్రతిష్టింపబడి ఉన్న తెల్ల ఉప్పలమ్మ దేవాలయంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ సంకా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం శాస్త్రోక్తంగా దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వివేక్, బి.వెంకటస్వామిగౌడ్, క్లబ్ సభ్యులు బబ్లూ పాల్గొన్నారు.

## రూ.6.50లక్షల పవర్‌బోర్డ్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో నిర్మించిన కమ్యునిటీ హాల్‌లో శుక్రవారం రూ.6.50లక్షలతో నిర్మించతలపెట్టిన పవర్‌బోర్ నిర్మాణ పనులను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఇటీవల ఈ ప్రాంగణంలో నూతనంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తన ప్రత్యేక నిధులతో కమ్యునిటీ హాల్ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా రూ.6.50లక్షలను కూడా కేంద్ర మంత్రి తన ప్రత్యేక నిధుల నుంచి కేటాయించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, బి.సూర్యప్రకాశ్, ఐఎస్ఎన్.మూర్తి, సూర్యనారాయణ, బిజెపి గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్న సాయిచంద్, సీనియర్ బిజెపి నేతలు పి.నర్సింగరావు, ప్రకాశ్‌యాదవ్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, బిజెవైఎం డివిజన్ అధ్యక్షుడు జి.అరుణ్‌కుమార్, గోపి, సత్యేందర్ పాల్గొన్నారు.

## 27న గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సమావేశం

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యాచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటి సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయగాన సభలో జరుగుతుందని సొసైటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,పొన్నం ప్రభాకర్,ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. 27న సమావేశానికి సొసైటి సభ్యులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## మార్చి3న నగరంలో "ఎల్లో రిబ్బన్ రన్ "




టీషర్ట్ ఆవిష్కరిస్తున్న సీనీనటులు శివ, రాశీసింగ్, విమీ బింద్రా తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త: ఎండోమెట్రియోసిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సినీ కథానాయకుడు శివ, కథానాయిక రాశీసింగ్ అన్నారు. ఎండోమెట్రియోసిస్ రోగుల కోసం ప్రారంభించిన ఎండోమెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రన్ నిర్వహించడం అభినందనీమన్నారు. దేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఎల్లో రిబ్బన్‌రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో మార్చి3 వ తేదీన నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించే రన్‌కు సంబంధించిన పోస్టర్, టీషర్ట్,మెడల్స్‌ను ప్రముఖ వ్యాపారవేత్త కరుణాగోపాల్, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విమీ బింద్రలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకురాలు బింద్రా మాట్లాడుతూ సగటున 10మంది మహిళల్లో ఒకరఉ ఎండోమెట్రియాసిస్‌తో బాధపడుతున్నారని అన్నారు. దేశంలో దాదాపు 42కోట్లమంది మహిళలు ఈవ్యాధిబారిన పడుతున్నార న్నారు. ఇలాంటి వారికి సాయం అందించాలన్న ఉద్దేశ్యంతోనే ఈస్వచ్ఛంద సంస్థను స్థాపించినట్లు పేర్కొన్నారు. ఈరన్‌కు దాదాపు 3వేలమంది హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

## మార్చి 1న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిచే "విజయసంకల్పయాత్ర'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ నిర్వహించబోయే 'విజయసంకల్పయాత్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముషీరాబాద్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెంట్ అభ్యర్థి పూస రాజు, గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్ బిజెపి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పూస రాజు, రత్నాసాయిచంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మార్చి 1న ముషీరాబాద్ నియోజకవర్గంలో బస్సుయాత్రలో కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముషీరాబాద్ ప్రబారి వేముల అశోక్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రామ్, డివిజన్ నేతలు టి.గోపాల్, వివిస్టీ రాజు, జి.శ్రీకాంత్, జి.దామోదర్, జి.శ్రీనివాస్, ఎం.ఉమేశ్, వి.నవీన్‌కుమార్, పిఎన్.రావు, ఆకుల సురేందర్, ఎం.శ్రీనివాసరావు, బి.తులసి, కె.సత్యేందర్ పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఆర్‌ఐటిఎంలో టెక్నికల్ ఫెస్ట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

దుండిగల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: నగరశివారు దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్‌ఆర్‌ఐటిఎం), ఫార్మాసీ కళాశాలలు సాంకేతిక అభివృద్ధిలో భాగంగా సంయుక్తంగా నిర్వహిస్తున్న నేష్నల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ వెలారస్ 2కె24 కార్యక్రమంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా విద్యార్థులు సాంకేతికపరమైన ఆవిష్కరణలు ప్రదర్శించారు. ప్రధానంగా రోబోటిక్స్, కోడింగ్ అండ్ డిబగ్గింగ్, బిల్డింగ్ అర్కిటెక్చర్, బిజినెస్ ఇ-సమ్మిట్, పేపర్ ప్రజెంటేషన్, వెల్డింగ్, బ్యాటరీ వెహికిల్స్, బ్లడ్‌టెస్ట్, ఐ చెకప్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై భవిష్యత్తు ఉపయోగాలను సువివరంగా వివరించారు. కళాశాల డైరెక్టర్ డా.కెవి.రెడ్డి మాట్లాడుతూ ఈఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాల నుండి ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ఆలోచనలు వారి సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం కల్పించడానికి అనేక టాప్‌క్లాస్ ఈవెంట్‌లు నిర్వహించబడుతాయన్నారు. కార్యక్రమంలో అతిథులుగా బ్రిగేడియర్, పి.గణేశం, శాంత తౌతం, శ్రేయరెడ్డి, ప్రిన్సిపాల్ డా.మురళిప్రసాదద్, ఫార్మసి ప్రిన్సిపాల్ డా.అర్ణబ్‌మాలిక్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లాస్య నందిత మృతికి సంతాపం ప్రకటించిన రాజ్యసభ సభ్యుడు

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల రాజ్యసభ నూతన సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే యువ ఎమ్మెల్యేలలో ఒకరైన లాస్య నందిత మరణించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నానని, ఆమె కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి ప్రకటించారు.

### లోక్‌దళ్ పార్టీ సంతాపం

యువ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదంలో మృతి చెందడం పట్ల లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్‌రావు సంతాపం తెలిపారు. చాలా చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం బాధకరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

### ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించాలి



యూసుఫ్‌గూడ జిహెచ్ఎంసి కార్యాలయంలో సమస్యలపై అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని రహ్మత్‌నగర్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. ఇందుకు గాను శుక్రవారం యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయంలో డిసి సేవ ఇస్లావత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు.డివిజన్‌లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటిని పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఏయమ్ వోహెచ్ రవి, ఎస్ఎస్ విజయ్ కుమార్, నాయకులు ఎక్బాల్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

నార్సింగి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : అసభ్యకర స్పర్శలు, మాటలతో వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ వివరించారు. గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామానికి చెందిన ఓ మహిళ తమ బంధువే తనను అసభ్యకరంగా తాకుతూ, మాట్లాడుతూ నిత్యం నన్ను వేధిస్తున్నాడని, ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిందని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై 354,506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాధితురాలి ఇంటికి వెళ్లి విచారిస్తామని, నిజంగానే వేధిస్తున్నాడా? ఆస్థి గొడవలు ఏమైనా ఉన్నాయా? వంటి అన్ని కోణాల్లో విచారించి, పూర్తి వివరాలు వచ్చాక వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## 'ఆత్మ' ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కోదండరామ్



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ కింద (ఆత్మ) కింద పనిచేస్తున్న వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ఆత్మ స్టాఫ్ అసోసియేషన్‌కు సంబంధించిన నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడవత్ కృష్ణనాయక్, ఎం.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జ్యోతిలక్ష్మి, ఉపాధ్యక్షురాలు అపర్ణరెడ్డి, సాయిచరణ్, రవీందర్, వినోద, స్పందన, జయంతి, కిరణ్, ఆత్మ ఉద్యోగులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్రంలో 'ఆత్మ' ఏజెన్సీలో పనిచేస్తున్న ఉద్యోగులను వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎలాంటి ఇంక్రిమెంట్, పిఆర్‌సీ ఇవ్వడం లేదని, మణిపూర్, సిక్కిం రాష్ట్రంలో ఏ విధంగానైతే ప్రభుత్వంలో విలీనం చేసుకున్నారో అదే తరహాలో తమను కూడా వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. అనంతరం నూతన సంవత్సరం డైరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ గోపి కూడా డైరీని ఆవిష్కరించారు.

## గోపన్ పల్లిలో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యాన్ని నివారించాలి

-మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన సంఘం నాయకులు



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించిన సంఘం నాయకులు

సైఫాబాద్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: గోపన్ పల్లిలో ఉదో ్యగులకు కేటాయించిన ఇళ్ళ స్థలాల పంఎణిలో జాప్యాన్ని నివారించి భాగ్యనగర్ టిఎన్‌జివో గచ్చిభౌలి మాక్స్ హౌసింగ్ సొసైటికి ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్ష నర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమరెల్లి, ప్రధాన కార్యదర్శి తు మూ అశోక్‌రెడ్డి నేతృత్వంలోని ఒక ప్రతినిధ బృందం రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందని ఆరోపించారు. గత ప్రభు త్వం ఇళ్ళ స్థలాలు ఇవ్వకపోవడమే కాకుండా 1991లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకుని అన్యాయం చేసిందని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి తమకు ఇళ్ళ స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి న్యా యం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## శాస్త్రీయ సంగీతం మనసుకు ఊరట, ప్రశాంతత కలిగిస్తుంది

-కస్టమ్స్ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్



సంగీత కళాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: శాస్త్రీయ సంగీతం మనసుకు ఊరట, ప్రశాంతతతో పాటు వత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుందని కస్టమ్స్ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ సంగీత సంస్థ ఆనందమహతీ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో గురువందనం పేరిట శాస్రీనతయ సంగీతభరిత కార్యక్రమం జరిగింది. ప్రఖ్యాత వీణా వాయిద్య నిపుణులు, విశ్వభూషణ్, వీణావాణి, ఆనందరాజ్యలక్ష్మి చవాన్ శిష్యబృందం వీణాగోష్ఠి గాన మాధుర్యంతో గురువందనంచేశారు. వీణావాయిద్య గోష్ఠిలో కళాకారిణులు త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్, వెంకటసుబ్బయ్య, పురందరదాసు తదితర వాగ్గేయకారుల శృతిలయబద్ధంగా కీర్తనలను వీణపై పలికించారు. మృదంగంపై రాజగోపాల్, ఘటంపై దుర్గాకుమార్, డోలుపై రవిచంద్రబాబు వాయిద్యసహకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.శ్రీనివాస్ ప్రసంగించారు. ఆనంద రాజ్యలక్ష్మి వీణావాదనలో శిక్షణ ఇచ్చి ఎందరో ప్రతిభావంత కళాకారులను దేశానికి అందిస్తూ, దేశసంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో సహకరిస్తున్నారన్నారు. క్షీరసాగరం వ్యవస్థాపకులు వి.ఆనందమోహన్, బసవతారకం, ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ సెంథిల్ రాజప్ప, కర్ణాటక సంగీత గాయని బాలత్రిపురసుందరి, న్యాయవాది విజయకుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గురువు ఆనంద రాజ్యలక్ష్మి శిష్య బృందం పాదపూజ చేసి సత్కరించారు. కార్యక్రమానికి ఇందిరా హేమ వ్యాఖ్యాత్రిగా వ్యవహరించారు.

## వెన్నెల ఫౌండేషన్ చైర్మన్ వరల్డ్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపిక



కిషోర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: రష్యాలో జగరనున్న వరల్డ్ యూత్ ఫెస్టివల్‌కు వెన్నెల ఫౌండేషన్ చైర్మన్ కిషోర్ ఆహ్వానం అందుకున్నారు. ప్రతి నాలుగైదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈఫెస్టివల్ 2021 లో జరగాల్సి ఉండగా కోవిడ్ కారణంగా రద్దు చేసి ఈఏడాది నిర్వహిస్తున్నారు. 180 దేశాల నుండి 20వేల మంది యువత పాల్గొనే ఈఫెస్టివల్‌కు కిషోర్‌ను ఎంపికైయ్యారు. వెన్నెల ఫౌండేషన్ ద్వారా కేరళలో వరదలు వచ్చినప్పుడు కిషోర్ తన బృందంతో వెళ్ళి 12రోజుల పాటు సహాక చర్యల్లో పాల్గొని వరద బాధితులను సహాయం చేశారు. లాక్‌డౌన్‌లో 42రోజుల పాటు క్యాంపు నిర్వహించి సొంత ఊర్లకు వెళ్తున్న వేలాది మంది భోజన సహాయం, స్పాన్సర్స్ సహాయంతో బీహార్, కొలకత్తా, మహారాష్ట్ర, ఒడిస్సా, యూపిలకు సుమారు 25 బస్సులను ఏర్పాటు చేసి వారివారి స్వంతస్థలాకు పంపిచారు. అదే విధంగా మేడారం, ఖమ్మం, రంపచోడవరం అడవి ప్రాంతాల్లో నివసించే ఆదివాసుల ప్రాంతానికి వెళ్ళి వారి జీవన విధానాన్ని చూసి వారికి న్యూట్రిషన్స్ ఫుడ్, పిల్లలు సులభంగా చదువుకునేందుకు పోస్టర్స్, బుక్స్, స్పోర్ట్స్ కిట్స్‌ల వంటి అందజేసి వారికి ఎంతో తోడ్పాటునందించారు. కిషోర్ సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయన్ని ప్రశంసిస్తూ వరల్డ్ యూత్ ఫెస్టివల్‌కు ఆహ్వానించారు. ఈసందర్భంగా కిషోర్ మాట్లాడుతూ చాల సంతోషంగా ఉందని సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తామన్నారు. ఈమేరకు మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు కిషోర్‌ను ప్రత్యేక అభినందిస్తూ తనవంతు సహకారం అందిస్తానన్నారు.

## బిసిలకు 8ఎంపి సీట్లు కేటాయించాలి

-బిసిసేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్



బిజెపి సెక్రటరీ ఉమాశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న కృష్ణయాదవ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 8పార్లమెంట్ సీట్లు కేటాయించాలని బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆపార్టీ సెక్రటరీ ఉమాశంకర్‌ను కలిసి మెమోరండం అందజేశారు. అనంతరం కృష్ణయాదవ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎంపి సీటున బిసినాయకులు బండారి శాంతికుమార్‌కు కేటాయించాలన్నారు. బిసిల కోట్ల కోసం కుస్తీ పట్టే నాయకులు రాజ్యాధికారంలో న్యాయమైన వాటా దక్కకుండా అడ్డుకుంటున్నారన్నారు. బిసిజపం చేస్తూ బిసిల ఓట్లు దండుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు అని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తమ బిసివ్యతిరేకతను రేవంత్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని, బిఆర్ఎస్ బిజెపిపార్టీలైనా జనాభా ప్రాతిపధికన బిసిలకు పార్లమెంట్ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గొడుగు నర్సింహులు, ఎడ్ల రాజు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాము : ఎమ్మెల్యే



రాజేంద్రనగర్ డివిజన్ గోల్డెన్‌హైట్స్ కాలనీలో సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

చార్మినార్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని గోల్డెన్‌హైట్స్ తదితర ప్రాంతాలలో సర్కిల్ అధికారులు ఇఇ నాగేందర్, జల మండలి, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపిస్తానని తెలిపారు. ప్రజలిచ్చిన అధికారంతో ప్రజల ఇబ్బందులు దూరం చేసేందుకు రేయింబవళ్లు కష్టపడుతానన్నారు. ముఖ్యంగా తాగునీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, పార్కులు, సీసీ రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, స్మశాన వాటికలు వంటి మౌళిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ప్రజలు ముందుగా మీ స్థానిక కార్పోరేటర్లకు సమస్యలను తెలియజేయాలని, వారు స్పందించకుంటే నేరుగా నా దృష్టికి తీసుకు రావాలన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు దూరం చేస్తున్నందుకే ప్రజలు వరుసగా నాలుగో మారు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుకునేందుకు అధిక సమయంను ప్రజలకే కేటాయిస్తున్నానని తెలిపారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**కేశంపేట్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన సుర మోని యాదయ్య ముదిరాజ్ గారి తల్లి అయిన సురమోని కిష్టమ్మ చనిపోయిన విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే అంత్యక్రియల నిమిత్తం 10000వేల రూపాయలను ఆర్థిక సాయంగా శు క్రవారం కిష్టమ్మ కుమారుడైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురమోని యాదయ్య ముదిరాజ్‌కు అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య నర్సింలు వెంకటయ్య బాలు శేకర్ బాలరాజ్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రేపటినుండి మల్లన,భీరప్పస్వామి దేవాలయాల ఉత్సవాలు

**పూడూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధి లోని కద్మూరు గ్రామంలో ఈనెల 25వ తేదీ ఆదివారం నుండి 27వ తేదీ మంగళవారం వరకు మల్లన్న,భీరప్ప స్వామి దేవాలయాల ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తేది 25 ఆదివారంరోజు ఉదయం 9గంటలకు మల్లన్న బోనాలు ఊరేగింపు,మధ్యాహ్నం 11గం.30నిమిషాలకు మ ల్లన్న స్వామివారి కళ్యాణం,తేది 26 సోమవారంరోజు ఉదయం 8గం.30 నిమిషాలకు భీరప్ప బోనాలు ఊరేగింపు.మధ్యాహ్నం 11గం.30 నిమిషాలకు భీరప్ప స్వామివారి కళ్యాణం,తేది 27 మంగళవారం భీరప్ప స్వామి నాగవెల్లి,మధ్యాహ్నం 2.00గంటలకు చుక్కబోనం కార్యక్రమాలతో ఉత్స వాలు ముగుస్తాయని వివరించారు. ఆదివారంరోజు ఆలయకమిటి అద్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, ఇట్టి ఉత్స వాలకు వివిధ మండలాల్లోని ఆయా గ్రామా లకు చెందిన భక్తులు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాలను జయప్ర దం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అలూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ దారుణ హత్య

**చేవెళ్ల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

అలూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ దారుణ హత్యకు గురైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.చేవెళ్ల ఎస్ఐ-2 ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చేందిన హర్యానాయక్ (40) చేవెళ్ల మండలం అలూరు గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో అపరేటర్‌గా పనిచేస్తు న్నాడని, శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటలకు ఎల్లకొండ శ్రీనివవాస్ సబ్ స్టేషన్‌కి వెల్లి చూడగా హర్యానాయక్ రక్తంతో కింద పడి ఉన్నాడని తెలిపారు. హర్యానాయక్ ఫోన్ చేసి తనతో నేపాల్‌కు చేందిన పలువురు వ్యక్తులు గొడవ పడుతున్నారని తెల్లవారు జామున 12,40 గంటలకు ఫోన్ చేసి చేప్పాడని శ్రీనివాస్ తెలిపాడని తెలి పారు. అలూరు లో జాతర ఉన్నందున సబ్ స్టేషన్‌కు వెల్లానని తెలి పారు. అక్కడికి వెళ్లిన వెంటనే హర్యానాయక్ తీవ్ర రక్త స్రావంతో పడి ఉన్న విషయంను విద్యుత్ ఎఇ మహియుద్దీన్‌ను సమాచారం అందించాడని తెలిపారు. విద్యుత్ ఎఇ మహియుద్దీన్ చేసిన పిర్యా దు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేవెళ్ల ఎస్ఐ-2 ప్రదీప్‌కుమార్ తెలిపారు.

## యాచారంలో అంబేద్కర్ జగ్జీవన్ రామ్ భవనం తక్షణమే నిర్మించాలి



మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పలువురు నాయకులు

**యాచారం ఫిబ్రవరి23,ప్రభాతవార్త :** యాచారం మండలంలో ప్రభు త్వం భూమిలో వెంటనే అంబేద్కర్,జగ్జీవన్ రామ్ భవన నిర్మాణానికి వెంటనే స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని ఎమ్మార్పిఎస్ నాయ కులు డిమాండ్ చేశారు.గురువారం యాచారం మండల కేంద్రంలో అన్ని పార్టీ మాదిగల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ కార్యక్రమం లో భవన నిర్మాణ సాధన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీ నర్‌గా మేడిపల్లి మాజీ సర్పంచ్ బోడ కృష్ణ,కో కన్వీనర్లుగా జోగు కృష్ణ, మొండి గౌరెల్లి తాజా మాజీ సర్పంచ్ బండి మీది కృష్ణ మా దిగ, బోడ అబ్బయ్య,సిద్ధపురం శ్రీకాంత్,కాళ్ల జంగయ్య,చింతుల్ల సా యిలు, బోడ ముత్యాలు,యంజాల అంజయ్య,మూలి మహేష్, జోగు అంజయ్య, కందికంటి ఆనంద్,కంబాలపల్లి,సాయిలు,తోట్ల చం దు, శంకర్,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లకు పట్టాలు, రిజిస్ట్రేషన్ల సమస్యలుపరిష్కరించాలి



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలో నెలకొన్న ఇళ్ల క్రమబద్దీకరణ సమస్యను పరిష్క రించాలని కోరుతూ ఆకాలనీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ఇడబ్ల్యుఎస్‌కాలనీ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి పి. శశిధరన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వెళ్లి అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఘట్‌కేసర్ సర్వేనంబర్ 132లోని 18-13 ఎకరాలలో జలగం వెంగళరావు ముఖ్యమంత్రి ఉన్న సమయంలో 469 కుటుంబాలకు 1975 సంవత్సరంలో పట్టాలు ఇచ్చారని తెలిపారు. 4 దశల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా పట్టాలు తీసు కొని ఇండ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఇళ్లపై అధికారులు ఇచ్చిన ఋణాలకు సంబంధించిన వాయిదాలను చెల్లించగా కొంతమంది ఓటిఎస్ కింద డబ్బులు చెల్లించగా వారికి పట్టాసర్టిఫికేట్, క్లీయరెన్స్ పత్రాలు ఇచ్చారని తెలిపారు. ఇంకా 90 శాతం మందికి ఋణాల డబ్బులు చెల్లించినప్పటికి ఎన్‌ఓసీలు జారీ చేయలేదని, వీకర్‌సెక్షన్ ఇండ్ల బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు. జిఓ 58, జిఓ 118 ద్వారా ఇతర ఏమైనా క్రమబద్ధీకరణకు అవకాశాలు ఉంటే మేము డీడ్ చేసుకోవడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. గతంలో ఈవిషయమై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, తహశీల్దార్, హౌసింగ్ కార్పొ రేషన్ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. విచా రణ జరిపి అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, బర్ల రాధా కృష్ణ, మన్నె సత్తిరెడ్డిలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పాటు పడాలి



కుమ్మెర మాజీ సర్పంచ్ పాండుగౌడ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి అహ్వానించిన చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్,ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**చేవెళ్ల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పాటు పడాలని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం అజీజ్‌నగర్‌లోని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్ నివాసంలో ముడిమ్యాల

### చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్

సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ముడిమ్యాల మాజీ సర్పంచ్ ప్రభాకర్ అద్వర్యంలో కుమ్మెర మాజీ పాండుగౌడ్‌తో పాటు సుమారు 200 మంది టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్ టిఆర్ఎస్ నుండి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలో చెర్చుకున్నారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన బీంభరత్ మాట్లాడుతూ రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీ బలంగా మారుతుం దన్నారు.ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్న తీరుతో ఇతర పార్టీలోని నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ముడిమ్యాల మాజీ సర్పంచ్ ప్రభా కర్, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి,డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి బిసి సెల్ అధ్య క్షుడు సూర్యపేట శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శంకర్‌యాదవ్, బొనగిరి ధర్శన్, బైండ్ల జంగయ్య, వార్డు మెంబర్‌లు కుమార్,హుస్సేన్, వెంకట్‌స్వామి, వీరేశం, పాషా, మురహరి, శంకరయ్య, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందించిన రంగారెడ్డి జిల్లా సిపియస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలి

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలని రంగారెడ్డి జిల్లా సిపియస్ ఉద్యో గుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్‌ను కోరారు. ఈ మేరకు వారు శుక్రవా రం నాడు మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపియస్ అధ్యక్షుడు తాహేర్ అలి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తారనే నమ్మకం తమకు ఉందని అన్నారు. సిపిఎస్ అమలు వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం వృద్ధా ప్యంలో పెన్షన్ సౌకర్యం లేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక ఆందో ళనకు గురవుతున్నారని అన్నారు. మరణించిన, పదవీ విరమణ పొందిన సిపి ఎస్ ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి అత్యంత దయానీయంగా ఉందని తెలి పారు. వెంటనే సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమల్లోకి తేవాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు. గత దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్నా, గత ప్రభుత్వం తమది ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూనే సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో సిపిఎస్ విధానాన్ని ఇప్పటికే రద్దు చేసిన సంగతి తెలిసిందేనని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున రాబోయే లోక్‌సభ ఎన్నికల లోపు ముఖ్యమంత్రి దృష్టికి తమ సమస్య తీసుకెళ్లి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చూడాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమల్ల దర్శన్‌గౌడ్, సురేందర్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి, భక్తవత్సల రవికిరణ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాహేర్ అలి, నల్గొండ జిల్లా కోశాధికారి అందుగల విజయ్, నల్గొండ జిల్లా మహిళా కన్వీ నర్ వల్లపుదాసు భూలక్ష్మి, జయశ్రీ, సక్కుబాయి, విజయ్, రవికిరణ్, స్వర్ణలత, ఆంథోని, పద్మజ, చైతన్య, పుష్ప, సీతారాం, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యెర్వగూడ వాసి మృతి

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యెర్వగూడ గ్రామా నికి చెందిన కుసుమగళ్ల వెంకటేష్ (31) ఈ నెల 22న మనసాన్పల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటి వద్ద డిన్నర్‌కి వెళ్లి తన పల్సర్ బైక్‌పై తిరిగి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఫతేపూర్ బ్రిడ్జి వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుని భార్య స్వాతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శంకర్‌పల్లి సిఐ వినాయక్‌రెడ్డి తెలిపారు.

## నిరుపేదలకు అండగా ఉండి ఆదుకుంటాం

**మండల కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి**



ఆర్థిక సహయం అందజేస్తున్న నారాయన్‌రెడ్డి

**పెద్దేముల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ తరపున నిరుపేదలకు అండగా ఉండి వారిని ఆదుకుంటామని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన వడ్డె మొగులప్ప అనారోగ్యంతో మృతిచెందడంతోశుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలవడవలసిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానిలో కొంతనైన పేదలకు సహయం చేస్తే కలిగే తృప్తి మరెందు లోలేదని అన్నారు. సాటిమనుషుల కష్టసుఖాలలో పాలుపంచుకోవడమే మాన వనైజమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటి అధ్యక్షుడు మైఫూస్, కుర్వ వెంకటప్ప, గొబ్బురు వెంకటయ్య, హెచ్ యాదప్ప, వై.ఎల్లప్ప, చెక్క భీములు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా..చల్లంగా చూడు.. అమ్మోరు తల్లి

**కొండాపూర్‌లో కన్నుల పండువగా ఊరడమ్మ జాతర**

**పెద్దేముల్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** అమ్మా చల్లంగా చూడు అమ్మోరు తల్లి అంటు గ్రామస్థులు అమ్మవారిని వేడుకుంటు పూజలు నిర్వహించారు.శుక్రవారం పెద్దేముల్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఊరడమ్మ జాతరను కన్నుల పండువగా నిర్వహించారు. జాతర సందర్బంగా అమ్మవారిఆలయానికి రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరెగింపుగా వెళ్ళి ఆలయప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. పిల్లపాపలు సల్లంగా ఉండాలని, పాడిపంటలుసమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. డప్పు, డోలు వాయిద్యాల చప్పుళ్ళకు శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. పోతురా జు చేసిన విన్యాసాలు, ఏరుపులసాణి వినిపించిన భవిష్యవాణి అందరిని ఆకట్టు కున్నాయి. పిల్లపాపలతో, బందువుల రాకతో ఇళ్ళన్ని కళకళలాడుతు కొండాపూర్ గ్రామంలోపండుగ వాతవరణం నెలకొంది.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** మండల పరిధి జంగరాయి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శివకుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవా రం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యంగౌడ్, ప్రసాద్,జ్యోతి, శ్రీనివాస్, దయానంద్, సంజీవరెడ్డి, ప్రభాకర్‌లు ఉన్నారు.

## నేటి నుంచి అనంత బృందావన ఆశ్రమ జాతర మహోత్సవాలు

**పెద్దేముల్, పిబ్రవరి 23, ప్రభాతవార్త:** అనంత బృందావన ఆశ్రమంలో ఈ నెల 24, 25న జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు అనంతయ్య స్వామి తెలిపారు. పెద్దేముల్ మండలం జనగాం శివారులోని గువ్వలగుట్టలో ఈ నెల 24(నేడు) శనివారం ఉదయం 6 గంటలకు ద్వజరోహణంమంగళహారతి, 8 గంటలకు శనైశ్వరుడికి తైలాభిషేకం, రేవణ సిద్దేశ్వరుడికి అభిషేకం,సాయంత్రం దీపారాధన, భజన కార్యక్రమాలు, 25 ఆదివారం నాడుఉదయం పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకం, పంచలింగాలకు అభిషేకం, గ్రామంలోని శివాలయం నుంచి పార్వతిపరమేశ్వరుల ఊరెగింపు, అనంతరందేవదేవుల కల్యాణం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనా లని ఆయన కోరారు.

## గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం ప్రాధాన్యం : జడ్పీటిసి



తొరుమామిడిలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పిటిసి సంతోష

**బంట్వారం, ఫిబ్రవరి 23,(ప్రభాతవార్త ) :** గ్రామాల అభివృద్దె ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పిటిసి సంతోష పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తొరుమామిడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల ప నుల ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తుందని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు. స్థానిక ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చలవతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో అన్ని మండలాల కన్నా బంట్వారంకు అధిక నిధుల ు మంజూరు చేయించి, అభివృద్ధి చేయడం అర్హించదగ్గ విషయమని ఆమె చెప్పారు. ఇప్పటివరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పలు గ్రామాల్లో సిసి రోడ్ల ప నుల ను చేపట్టి పూర్తి చేయడం జరిగిందని, అదేవిధంగా తొరుమామిడిలో త్వరలోనే అన్ని సిసి రోడ్లు డ్రైనేజీ ప నుల ు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్య క్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్ అంజయ్య, మాజీ సర్పంచ్ మొగులయ్య, మున్నాభాయ్ తౌఫిక్, ఇసాక్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## సీనియార్టీకి ప్రాధాన్యతనివ్వని విద్యా శాఖాధికారులు

**-అధికారుల తీరుపై ఉపాధ్యాయుల విమర్శలు**

**బంట్వారం, ఫిబ్రవరి 23,(ప్రభాత వార్త ) :** మండలంలో విద్యాశాఖ తీరు పలు విమర్శలకు దారి తీస్తుంది. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ స్వంత ఎజెండాగా కార్యాచరణ కొనసాగిస్తున్నారని, ఇందుకు జిల్లా స్థాయి అధికారులు సైతం వారికి సహకరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. మం డల విద్యాధికారి నిబంధనలు పాటించకపోవడానికి గల కారణాలేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా మండలంలో పని చేస్తున్న జూనియర్ ఉపా ధ్యాయున్ని ఇతర రాష్ట్రంలో శిక్షణ తరగతులకు పంపించడం ఈ విమర్శకు దారి తీస్తుంది. వివరాలోకి వెళితే, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ తరుపున గుజరాత్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వర్క్ షాప్ తరగతులకు మండలంలో ఉన్న గుర్తింపు గల ఉపాధ్యాయుల ను శిక్షణ నిమిత్యం ఎంపిక చేసి పంపడం జరిగింది. అయితే ఇందులో జిల్లా వ్యాప్తంగా 9 మంది ఉపాద్యాయుల ు ఆయా మండలాల నుండి ఒక్కొక్కరిని పంపడం జరిగింది. ఈ వర్క్ షాప్ మూడు బ్యాచ్ లుగా చేసి ఇదే నెల 10న ఒక బ్యాచ్, 18న రెండవ బ్యాచ్, 25 నుండి మూడవ బ్యాచ్‌లు వెళుతున్నాయి. కాగా ఇప్పటికే మండలం నుండి సల్బత్తాపూర్ పాఠశాల ఉపాద్యాయుడు వెంకటేశంను శిక్షణ నిమిత్యం గుజరాత్ రాష్ట్రానికి పంపడం జరిగింది. అయితే ఈ ఉపాధ్యాయునికి ఎలాంటి సీనియారిటీ లేదని జిల్లా ఉపాధ్యాయ సంఘము నాయకుడు ఒకరు తెలియజేశారు. అయితే బం ట్వారం మండలంలో 10యేండ్ల నుండి, 20 యేండ్ల సీనియారిటీ ఉన్న వారు ఉండగా కేవలం నాలుగేళ్ల సీనియారిటీ సైతం లేని ఉపాధ్యాయున్ని పంపడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు శిక్షణలో నైపుణ్యం పెంపొందించెదుకు మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులను పంపడం మంచిదని వారు వాపోతున్నారు. అన్ని మండలాల్లో నుంచి సీనియారిటీ ఉన్న వారిని పంపిన అధికారులు, బంట్వారం లో మాత్రం ఇలా ఎందుకు చేశారని, జిల్లా అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇందులో స్థానిక ఎంఈవో పాత్ర ఉంటుందనేది వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా జిల్లా స్థాయి అదధికారులు ఇలాంటి విషయాల్లో సరైన నిబ్బందనలు పాటించాలని వారు కోరుతున్నారు.

## ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్..3లక్షల ఆస్తి నష్టం



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్గమైన సామాగ్రి

**కొడంగల్,ఫిబ్రవరి 23ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇనాయత్ ఖాన్ ఇంట్లో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగింది.ఒక్కసారిగా మం టలు చెలరేగడంతో సుమారు రూ.3లక్షల విలువైన సామాగ్రి దగ్ధమైనట్లు బాధితు డు వాపోయాడు.విషయం తెలుసుకున్న కాంగ్రేస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ దాము,మైనార్టీ పట్టణ అద్యక్షులు సయ్యద్ హమీద్‌లు బాధితుడిని పరామర్శించి ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందజేత

**మర్కుక్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామా నికి చెందిన ఎర్రబాగు రమేష్ రెండు నెలల క్రితం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ పోర్టర్ నమోదు చేశారు. బాధితుడు రమేష్ పోగొట్టుకున్న ఫోన్‌ను ఈనెల 21వ తేదీన దొరకబట్టి బాధితునికి అందజేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



పనులను ప్రాంభిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

## 60 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకారం

**కీసర, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ చేతులమీదుగా శుక్రవారం 1వ వార్డులో బిల్డింగ్‌లకు పెయింటింగ్ మరియు వాటర్ ట్యాంకుల మరమ్మత్తులు చేయుటకు రూ.20లక్షలతో శంకుస్థాపన, 2వ వార్డులో భూగర్భమురికి కాలువ నిర్మాణం చేయుటకు రూ.20లక్షలతో శంకుస్థాపన, 3వ వార్డులో భూగర్భమురికి కాలువ నిర్మాణం చేయుటకు రూ.20లక్షలతో, మొత్తం రూ.60లక్షల మున్సిపాల్ సాధారణ నిధులతో అభిమృద్ధిపనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ ఎస్ రాజమల్లయ్య,డిఈఈ చిరంజీవులు సా ్థనిక వార్డు కౌన్సిలర్లు నానునాయక్, నాగాయిపల్లి సుజాత కొత్త హేమలత కో ఆప్ సభ్యులు షేక్ శాదుల్ బిఆర్ఎస్ నాయకులు వసుపతి శ్రీకాంత్‌గౌడ్, తిరుపతిరెడ్డి కాలనీ ప్రెసిడెంట్‌లు కాలనీ వాసులు, మరియు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పాల్గొన్న డాక్టర్లు

**కీసర, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** శుక్రవారం నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో పల్స్ పోలియో గురించి సమావేశం నిర్వ హించడం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ మార్చి 3వ తేదీన బూత్‌సా ్థయిలో పోలియో చుక్కలు వేయడం జరుగు తుం దన్నారు. మరియు 4 నుంచి 6 తేదీవరకు ఇంటింటికి వెళ్లి ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. హైరి స్క్ ప్రాంతాలైన మురికివాడలు సంచార జాతులు ఇటుక బట్టీలు నిర్మా ణ స్థలాలలో నివసిస్తున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలియో బూ తులను ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది. 5 సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేసేలా చిన్నారులకు వ్యాధి సోకకుండా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమలో మున్సిల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ వికాస్ నగర్ బస్తీ దవఖానా డాక్టర్ కుమార్ రాంపల్లి బస్తీ దవాఖాన డాక్టర్ సింధుజ మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ ఎఎన్ఎం రంగనాయకమ్మ ఆశవర్కర్లు అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

**బొంరాస్‌పేట్,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పుమళ్ళలో విద్యార్థులు ఉపాధ్యాయులై స్వ యం పరిపాలన దినోత్సవంను క్లస్టర్ జిహెచ్ఎం శ్రీహరిరెడ్డి అధ్వ ర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలకంఠం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం విద్యార్థులు ఉపా ధ్యాయులుగాప్రత్యేకంగా తయారై పాఠశాలకు వచ్చారు. అనం తరం తమ తోటి విద్యార్థులకు పాఠ్యంశాలను బోధించి ఉపాధ్యా యులు తమకు పాఠ్యంశాలు చేప్పేందుకు ఎంత కష్టపడు తున్న విష యంతోపాటుగా వారి సమస్యలను తెలుసుకున్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందిం చారు. విద్యార్థులు శ్రద్దగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతోపాటు మంచి ఉద్యోగాలు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యాశాఖ రీజి నల్ జాయింట్ డైరెక్టర్‌గాకుమారస్వామి, జిల్లా విద్యాధికారిగా భవాని, మండల విద్యాధికారిగా స్వాతి,జిహెచ్ఎంగా ప్రభావతి,పాఠశాల ప్రధా నోపాధ్యా యులుగా నవ్యశ్రీ,వ్యాయామ ఉపాధ్యాయులుగా శివ,ధ నుష్‌తోపాటు 24 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిం చారు.ఉపాధ్యాయులు రాములు,శ్రీనివాస్,సురేష్,జీవన్‌కుమార్,దాలి నాయుడు,ఎస్ఎంసి చైర్మన్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఏలను వెంటనే ప్రకటించాలి : జిల్లా అధ్యక్షులు

**దోమ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన మూడు డిఏలను ప్రభుత్వం వెంటనేప్రకటించాలని వికారాబాద్‌జిల్లా ఎస్‌టియు సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ అన్నారు.శుక్రవారం నాడుఉపాద్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ నిత్యవసర ధరలపెరుగుదలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒక సారి ప్రకటించ వలసిన డిఏలు జాప్యం చేయడందారుణం అని అన్నారు.గత ప్రభుత్వ హాయంలో ఉద్యోగ ఉపాద్యాయులకుసరెండర్‌లీవ్,మెడికల్‌లీవ్ తదితరబకాయిలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.ఈ ప్రభుత్వ హాయం లోనైనా బకాయిలు వెంటనే ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.రాష్ట్ర ఉపాద్యక్షులు బసిరెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సికమిటి సిపార్సులు వేగవంతం చేసి త్వరలో నూతన పిఆర్‌సి ప్రకటించాలని కోరారు.కోర్టు కేసుల నేపథ్యములోనిలిచిపోయిన బదిలీలు,పదోన్నతు లు ప్రక్రియ ఈ వేసవిసేవుల్లోగా పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్య క్రమములో జిల్లా కార్యదర్శి రాజేశ్,కౌన్సిలర్‌లు శ్రీనివాస్‌రావు, బసిరె డ్డి, కరుణాకర్,రమేశ్,గోపాల్,కనకాచారి, అంజిలయ్య, ఖయ్యూం, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రసన్నరాణిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) శుక్రవారం మర్యాదపూర్వ కంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్యాదరి మధు, కొలన్ నరేష్, గయాజుద్దీన్, హబీబ్, లతీఫ్, గడ్డం సంతోష్ గౌడ్, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## భక్తుల కొలహలం మధ్య బండెల ఎల్లమ్మ రధోత్సవం

**కొడంగల్,ఫిబ్రవరి19 ప్రభాతవార్త** అమ్మా ఎల్లమ్మ తల్లీ చల్లగా చూడమ్మా అంటూ... బండెల ఎల్లమ్మ తల్లీ జాతరకు భక్త జనం పోటెత్తింది.కొరిన భక్తుల కొర్కెలు తీరుస్తు భక్తుల కొంగు బంగారంగా నిలుస్తున్న బండెల ఎల్లమ్మ తల్లీ రధోత్సవం శుక్రవారం అంగరంగ వైభంగా కొనసాగింది.కొడంగల్ పట్టణ శివారులో కొలువుదీరిన బండెల ఎల్లమ్మ తల్లీ జాతర ఉత్సవాలు శుక్రవారంతో మొదలై మూడు రోజుల పాటు కొనసాగుతాయి.వేసవి కాలం ఆరంభంలో నియోజకవర్గంలో మొదటిసారిగా జరిగే ఎల్లమ్మ తల్లీ జాతరకు భక్త జనం పోటేత్తింది.వ్యవసాయ పంటలు చేతికొచ్చే సమయంలో కొనసాగే ఎల్లమ్మ తల్లీ జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రధంపై అమ్మవారి ప్రతిమను ప్రతిష్టించి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించారు.ఈ సందర్భంగా భకు_లు పూనకంతో రధోత్సవం ముందు ఊగుతుండగా భక్తులు గవ్వల బండారును చల్లుతు అమ్మవారికి తమ మొక్కులను తీర్చుకున్నారుఅంతకుముందు ఉదయం మహిళలు తలపై బోనాలతో ఊరేగింపుగా వెళ్ళి నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.పంటలు బాగా పండి చల్లగా చూడాలంటు రైతులు అమ్మవారిని వేడుకోవడం అనవాయితీ.జాతర ఉత్సవాల్లో భాగంగా కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి భకు_లు పెద్ద సంఖ్యలో తరలిరవడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.కాగ శనివారం రైతులు కాడెద్దుల బండ్లతో ఊరేగింపుగా వెళ్ళి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయడంతో పాటు ఆదివారం అమ్మవారి పెరుగుబసంతం కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు.కాగ జాతర ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు నిర్వహకులు తాగునీటి సౌకర్యం కలి్పంచారు.ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సిఐ రాములు,ఎస్సై భరత్‌రెడ్డి అద్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి: ఎంపిపి



ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఆసుపత్రికి వైద్యం కోసం రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని సామాజిక ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆయన సందర్శించి రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది అంకిత భావంతో పని చేసినప్పుడే రోగులకు అవసరమైన చికిత్స అందుతుందనా న్నరు. ఆసుపత్రికి పేద, సామాన్య ప్రజలే వైద్యం కోసం వస్తారని వారి పట్ల సహృదం, దయతో వ్యవహరించాలని ఆయన సూచించారు. మందులు మందస్తుగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సకాలంలో సరఫరా కావడానికి ఆర్డర్ ఇచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని ఎంపిపి పేర్కొన్నారు.

## యంనంపేట్‌లో చెత్త డంపింగ్‌ను అడ్డుకున్న యువకులు

**-తమ భూమిలో కాలుష్యం నివారించాలి**

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో వివాదాస్పద స్థలంలో చెత్తడంపింగ్‌ను స్థానిక యువకులు శుక్రవారం అడ్డుకున్నారు. సర్వేనంబర్లు 137, 138లలోని 2-27 ఎకరాల స్థలంలో పోచారం మున్సిపాలిటీ అధికారులు చెత్తను డంపింగ్ చేస్తుండగా చెత్త తగులబడి మంటలు చెలరేగడంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈస్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి మున్సిపల్‌లో ప్రజాప్రతినిధులు తీర్మాణం చేసి 85 లక్షల రుపాయలు కేటాయించారు. 1979 సంవత్సరంలో బయ్యన్నగుట్ట సమీపంలోని సర్వేనంబర్లు 137, 138లలో 28 ఎకరాల భూమిల్లో లేఔట్ చేసి ప్లాట్లు విక్రయించారు. ఈవెంచర్‌లో 2.27 ఎకరాల స్థలాన్ని సామాజిక స్థలంగా కేటాయించగా మరొక వెయ్యి గజాలను ఇతర అవసరాలకు కేటాయించారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీకి ప్రభుత్వ స్థలంగా అధికారులు అప్పగించడంతో అధికారులు చెత్తను డంపింగ్ చేస్తున్నారు. కాగా యంనంపేట్‌కు చెందిన రాజేందర్‌గౌడ్‌తో పాటు కొందరు యువకులు చెత్తను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఈవెంచర్ యాజమానుల ద్వారా వదిలిన 2-27 ఎకరాల స్థలాన్ని ( డాక్యుమెంట్ 3864/2020) ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. ఖాళీగా ఉన్న స్థలాన్ని అధికారులు తాత్కాలికంగా చెత్తకు వాడుకుంటామని చెప్పి ఇప్పుడు ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపిం చారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ సర్వేనంబర్ 46/1లో ప్రభుత్వ స్థలం ఉందని డంపింగ్‌యార్డు అక్కడ ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

### సెయింట్ ఆంథోనీస్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్-2 కార్యక్రమాన్ని శని వారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారి విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభా పాటవాలను ఉపాధ్యాయులు బోధించే తమ తమ విషయాల వారిగా వెలికి తీసే ఒక సహజ ప్రక్రీయ అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్య క్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత ఈ సలోమోన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఈ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అ అరుణారెడ్డి, ఆడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### రోబోటిక్స్ హ్యాకథాన్‌ని నిర్వహించిన సింక్రోనీ

సోహమ్‌అకాడమీ సహకారంతో ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ తమ సిటిజెన్షిప్ టీం ప్రారంభించిన వినూత్న కార్యక్రమంలో వినూత్నమైన రోబోటిక్స్ హ్యాకథన్‌ను నిర్వహించింది. సమగ్రత మరియు సాధికారత స్ఫూర్తితో నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో హైదరాబాద్ మరియు సమీప జిల్లాల్లోని 10 పాఠశాలల నుంచి 7 మరియు 8 తరగతులకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# దుండిగల్‌లోని ప్రభుత్వ భూములను కాపాడండి

**బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడి**

**ప్రభుత్వ భూములు ప్రైవేట్ భూములుగా మార్చిడికి యత్నం**

**ప్రభుత్వ భూముల్లో..అక్రమ నిర్మాణాల జోరు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా పరిధిలోని దుండిగల్‌లోని ప్రభుత్వ భూములను కాపాడాలని, ప్రభుత్వ భూములు,సీలింగ్ భూములు ప్రైవేట్ భూములుగ మార్చిడికి యత్నం జరుగుతున్నట్లు, పనికిరాని భూములు ప్రభుత్వానికి, పనికి వచ్చె భూములు ప్రైవేట్ వారికి కట్టబెట్టటం, దీంతో ప్రభుత్వానికి వందలాది కోట్ల రూపాయల నష్టం జరుగుతుందని వెంటనే విచారణ జరిపించాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కూడ కలిసి ఈ విషయాన్ని వివరించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా ప్రెస్‌క్లబ్‌లో బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దుండిగల్‌లోని ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు ప్రైవేట్ పరం అవుతున్నాయని, కబ్జాలు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు ప్రభుత్వానికి వందలాది కోట్ల రూపాయల నష్టం జరగనున్నట్లు వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను, అదనపు కలెక్టర్‌ను కోరటం జరుగుతుందన్నారు. దుండిగల్ రెవెన్యూ పరిధిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకు చేరువలో ఉన్న ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు కలిసి ఉన్నట్లు అయితే ప్రభుత్వ భూములను,సీలింగ్ భూములను ప్రైవేట్ భూములుగ మార్చిడి చేసు_న్నట్లు, ఆ భూముల్లో అక్రమంగ ప్రహరీగోడల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ప్రైవేట్ భూముల మార్పిడితో రియల్ ఎస్టేట్ దందాతో కోట్ల రూపాయలు అవతవకలు కుంభకోణం జరుగుతున్నట్లు ఆయన విమర్శించారు. మేడ్చల్ జిల్లా దుండిగల్-గండిమైసమ్మ మండలంలోని దుండిగల్‌లో గల ప్రభుత్వ భూములు సర్వేనెంబర్లు 282,284,321, 322,323, 324 వరకు, మరి కొన్ని సర్వేనెంబర్లులలో మొత్తం 106.07ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను, సీలింగ్ భూములను ప్రైవేట్ వ్యక్తుల కోసం ఇచ్చి పనికి రాని భూములను ప్రభుత్వ భూములుగ మార్చిడి చేసుకోవటం అక్రమం అని ఢీనోట్‌పై చేయటం జరుగుతుందని ఆయన ఆరోపించారు. విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి పనికిరాని భూములను ప్రభుత్వ భూములుగ మార్చిడి చేసుకోవటం జరుగుతుందని ఆయన విమర్శించారు. ఈ భూములను అక్రమంగ ఢీనోటిపై చేయటం జరుగుతుందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై గతంలోనూ ఫిర్యాదులు చేసినా మళ్లీ ప్రహరీగోడల నిర్మాణాలు, ఇతరత్రా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన వివరించారు. వెంటనే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ జరపాలని ప్రభుత్వ భూములను,సీలింగ్ భూములను కాపాడాలని బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి కోరారు.

# బిజెపి పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగింది

**నేటి నుంచి జిల్లాలో బిజెపి విజయ సంకల్ప యాత్ర ప్రారంభం**

**మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

పార్లమెంట్ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ (బిజెపి) పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందని, బిజెపి నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర శనివారం మేడ్చల్-మల్కాజ్‌గిరిలోకి చేరుతుందని, మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్‌బి నగర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల నుంచి 25న మేడ్చల్ నియోజకవర్గంలోకి చేరుతుందని బిజెపి శ్రేణులు, అభిమానులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి కోరారు. శుక్రవారం మేడ్చల్ జిల్లాలో ఆయనతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులతో కలిసి బిజెపి విజయ సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బిజెపి విజయ సంకల్పయాత్ర భాగ్యలక్ష్మి క్లస్టర్ పరిధిలోని యాదాద్రి-భువనగిరి జిల్లాలోని యాదాద్రిలో ఈ నెల 20న విజయ సంకల్పయాత్ర ప్రారంభమైందని శనివారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్‌బినగర్‌లో ప్రవేశిస్తుందని, అక్కడి నుంచి ఉప్పల్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలు పూర్తి చేసుకుని ఈ నెల 25న మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ యాత్ర నుంచి దమ్మాయిగూడ చౌరస్తా వద్దకు చేరుకుంటుందని, అక్కడే కార్నర్ బహిరంగసభ ఉంటుందని అన్నారు. అక్కడి నుంచి వివిధ మున్సిపాల్టీలు, మండలాల మీదుగా కుత్బుల్లాపూర్‌లోకి ప్రవేశిస్తుందని, ఆ తరువాత కూకట్‌పల్లి నియోజకవర్గంకు చేరుకుంటుందని ఆయన వివరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రజల్లోకి తీసుకవెళ్లటం జరుగుతుందన్నారు. బిజెపికి ప్రజల్లో మంచి ఆదరణ పెరిగిందని, గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిజెపి ఓటింగ్ శాతం గతంలో కన్నా పెరిగిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి విజయం తథ్యమని అన్నారు. బిజెపిని ప్రజలు ఆశీర్వదించటానికి బిజెపి విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తుందన్నారు. బిజెపి శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి కోరారు. ఘట్‌కేసర్ ఎంపిపి,బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ భారత్ సురక్షిత కోసం ప్రధాని నరేంద్రమోదీని మూడవసారి ప్రధానిగా ఎన్నుకోవటానికి బిజెపిని గెలిపించటానికి ప్రజలు ఎదు రుచూస్తున్నారని అన్నారు. ఆర్టికల్ 370, రామమందిర్, కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు బిజెపి అధికారాన్ని మరోసారి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ నెల 25న మేడ్చల్ నియోజకవర్గంలో బిజెపి విజయ సంకల్ప యాత్ర జరుగుతుందని అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు బుద్ది శ్రీనివాస్, బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యులు అచ్చిన నర్సింహ్మా, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, పలువురు రాష్ట్ర,జిల్లా నాయకులు కలిసి బిజెపి విజయ సంకల్పయాత్రపోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

## నందిని లాసితకు నివాళులు అర్పించి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**శంషాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే నందిని లాసిత మృతదేహానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాళులు అర్పించారు. శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో నందిని లాసిత అక్కడికక్కడే మరణించిన విషయం తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు ఆయన తెలిపారు. నందిని తండ్రి ఎమ్మెల్యే సాయన్న గత ఏడాది మరణించగా ఏడాది కాలంలోనే నందిని లాసిత మరణించడం చాలా దురదృష్టకరమైన విషమని పేర్కొన్నారు. ఆమెపవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుతున్నట్లు ప్రకాష్‌గౌడ్ తెలి పారు.

## ప్రజల మన్ననలను పొందడం అభినందనీయం



ఎంపిడివోకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

**నందిగామ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** సమాజ వికాసంలో అధికారుల పాత్ర ప్రశంసనీయమని సేవ చేస్తే సమాజం గుర్తిస్తుందని జెడ్పీవైస్ చైర్మన్ ఈటగణేష్ ఎంపిపి ప్రియాంక శివకుమార్ గౌడ్‌లు అన్నారు. నందిగామ మండల కేంద్రంలో గత నాలుగున్నర ఏళ్లుగా విధులు నిర్వహించిన ఎంపిడివో బాల్‌రెడ్డి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరిచిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేర్చడంలో ఎంపిడివో చేసి కృషి మరువలేనిదని అన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ఎంపిడివో బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగవృతిలో బదిలీలు సహజమని అన్నారు. ఈ ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడివో సుమతి తాజా మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి ఎంపిటిసిలు చంద్రపాల్‌రెడ్డి కొమ్ముకృష్ణ దేపల్లె కుమారస్వామి గౌడ్, నాయకులు బుయ్యని వీరేందర్‌గౌడ్, చిందం నరసింహులు మాజీ సర్పంచ్ జెకే నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### సమ్మక్క సారక్క గద్దెలను దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :** పట్టణంలోని సమ్మక్క సారక్క గద్దెలను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న సందర్శించి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పున్న లావణ్యసది, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి,ఎండి అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

### యంనంపేట్‌లో చెత్త డంపింగ్‌ను అడ్డుకున్న యువకులు

**-తమ భూమిలో కాలుష్యం నివారించాలి**

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో వివాదాస్పద స్థలంలో చెత్తడంపింగ్‌ను స్థానిక యువకులు శుక్రవారం అడ్డుకున్నారు. సర్వేనంబర్లు 137, 138లలోని 2-27 ఎకరాల స్థలంలో పోచారం మున్సిపాలిటీ అధికారులు చెత్తను డంపింగ్ చేస్తుండగా చెత్త తగులబడి మంటలు చెలరేగడంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈస్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి మున్సి పల్‌లో ప్రజాప్రతినిధులు తీర్మాణం చేసి 85 లక్షల రుపాయలు కేటాయించారు. 1979 సంవత్సరంలో బయ్యన్నగుట్ట సమీపంలోని సర్వేనంబర్లు 137, 138లలో 28 ఎకరాల భూమిల్లో లేఔట్ చేసి ప్లాట్లు విక్రయించారు. ఈవెంచర్‌లో 2.27 ఎకరాల స్థలాన్ని సామాజిక స్థలంగా కేటాయించగా మరొక వెయ్యి గజాలను ఇతర అవసరాలకు కేటాయించారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీకి ప్రభుత్వ స్థలంగా అధికారులు అప్పగించడంతో అధికారులు చెత్తను డంపింగ్ చేస్తున్నారు. కాగా యంనంపేట్‌కు చెందిన రాజేందర్‌గౌడ్‌తో పాటు కొందరు యువకులు చెత్తను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఈవెంచర్ యాజమానుల ద్వారా వదిలిన 2-27 ఎకరాల స్థలాన్ని ( డాక్యు మెంట్ 3864/2020) ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. ఖాళీగా ఉన్న స్థలాన్ని అధికారులు తాత్కాలికంగా చెత్తకు వాడుకుంటామని చెప్పి ఇప్పుడు ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ సర్వేనంబర్ 46/1లో ప్రభుత్వస్థలం ఉందని డంపింగ్‌యార్డు అక్కడ ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

## రామచంద్రాపురం డివిజన్‌లో బస్తీ దర్శన్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివి జన్ పరిధిలోని మయూరినగర్, శ్రీసాయినగర్ కాలనీల్లో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి కార్య క్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లా డుతూ కాలనీలో దాదాపుగా సమస్యలు అన్నింటిని పరిష్కరించడం జరిగిం దని, కాలనీల్లో సిసిరోడ్ల నిర్మాణానికి జోనల్ కమిషనర్ నిధులు మంజూరు చేశారని, రోడ్డు నిర్మాణానికి పరిసరాలను పరిశీలించామన్నారు. విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నామని కాలనీవాసులు తనదృష్టికి తేగా సమ స్యను పరిష్కరించేందుకు విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామి చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, దేవేందర్‌యాదవ్, విఠల్‌రెడ్డి, వీర్‌శెట్టి, రమేష్‌బాబు, భాస్కర్, అంజయ్య, శంకర్‌యాదవ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**పాపన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్ఐ నరేష్ అన్నారు. పాపన్నపేటలో ఉన్నత పాఠశాలలో శుక్రవారం సఖి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ కొత్తగా పరిచయం అయిన వ్యక్తులకు వారి పూర్తి వివరాలు తెలిసే వరకు అనవసర విషయా లపై చర్చించవద్దని, సోషల్ మీడియా ద్వార పరిచయం అయిన వ్యక్తుల పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్నారు. సఖి కేంద్రాలతో కలిగే ప్రయోజనా లపై వివరించారు. ఆపత్కాలంలో ప్రజలు 100తో పాటు ఇతర అత్యవసర నంబర్లకు ఫోన్ చేసి సహాయం అందుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఏఎస్ఐ సంగన్న, సఖి కేంద్రం నిర్వహకులు లక్ష్మీ, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మలకు మొక్కుల చెల్లింపు

**నంగునూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** సమ్మక్క-సారలమ్మ జాతం లో ఉత్సవాల్లో భాగంగా నంగునూర్ మండలంలోని అక్కెనపల్లి గ్రామం లో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులను చెల్లించుకున్నారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు ఇక్కడే నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కోళ్లను, మేకలను బలిచ్చి అక్కడే కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. విందు అనంతరం భక్తులు రాత్రి సమయం వరకు ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. నేడు సమ్మక్క- సారలమ్మలు వనప్రవేశం చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా సమ్మక్క-సారలమ జాతర ఉత్సవాలల్లో మొక్కుల సమర్పణలో భాగంగా మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, సంగు పురేందర్, కోల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## శామీర్‌పేట పెద్ద చెరువు అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా విలాసాగరం అశోక్ ఎన్నిక

**శామీర్‌పేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** శామీర్‌పేట పెద్ద చెరువు అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా విలాసాగరం అశోక్ ఎన్నికయ్యారు. చైర్మన్‌తో పాటు నూతన కమిటీ కార్యవర్గంను కూడ గ్రామ పెద్దలు సభ్యులు ఎన్నుకున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని నూతన కమిటీ చైర్మన్ విలాసాగరం అశోక్, కోశాధికారి దూడల వెంకటేశ్‌గౌడ్‌లు నూతన కమిటీని వివరించారు. ఈ కమిటీ వైస్‌చైర్మన్‌లుగా గుర్రం సునీల్‌రెడ్డి, దొంతరబోయిన నారాయణముదిరాజ్, కోవూరి కృష్ణ, సలహాదారుగ వాసలమర్రి శ్రీరాములు, కార్యదర్శిలుగ శావర్తి గణేశ్, జాయింట్ సెక్రటరీగ ముత్యాల నరేశ్‌చారి, డైరక్టర్లుగ వట్టెల కుమార్‌యాదవ్, బలేకారి కిరణ్, నల్లవల్లి రవీందర్, దుర్గ ప్రసాద్, కూరాకుల సాయికుమార్, గజ్వేల్ ప్రశాంత్, పీట్ల శ్రీకాంత్, బట్టు శంకర్‌లు ఎన్నిక కావటం జరిగిందని వారు వివరించారు.

## జాతీయ ఉపాధి హామీ పనుల ప్రారంభం..ఎంపిటిసి హన్మంత్‌రెడ్డి

**శామీర్‌పేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగ కూలీలతో కలిసి ఉపాధి హామీ పనులను ఎంసిపల్లి మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు,కేశవరం గ్రామ ఎంపిటిసి సభ్యుడు గోనె హన్మంతరెడ్డి ప్రారంభించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలోని నల్లకుంట చెరువులో ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో వ్యవసాయ కూలీలకు కనీస పని కల్పించటం కోసం కూలీలకు ప్రతి రోజుకు 270రూపాయలకు తగ్గకుండ ఉపాధి లభిస్తుందని, జాబ్ కార్డు ఉన్న కూలీలు అందరు ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బిల్‌కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వాటర్‌మెన్ రాజు, మహిళా కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతిపట్ల ప్రగాఢ సంతాపం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం పట్ల కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అప్జల్‌ఖాన్ ప్రగాఢ సంతాపంను తెలియజేశారు. శుక్రవారం ఆయన శామీర్‌పేటలో మాట్లాడుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాద సంఘటన అందరిని కలవరపర్చిందని ఆమె మృతి పార్టీకి, నియోజకవర్గానికి తీవ్ర నష్టం అని అన్నారు. అసెంబ్లీలో కొత్తగ రాణించి చిన్న వయసుల్లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం భాదాకరమని అప్జల్‌ఖాన్ అన్నారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపంను ఆయన తెలియజేశారు. ప్రమాద సంఘటన దురదుష్టకరమని ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని ఎండి అప్జల్‌ఖాన్ తెలియజేశారు.

# పేరు పెద్ద..ఊరు దిబ్బ...!

**-ఆచరణకు ఆమడ దూరంలో మున్సిపల్ బడ్జెట్ సమావేశం...**

**-చైర్‌పర్సన్ సంబంధీకులే పనికిమాలిని బడ్జెట్ అంటూ లూస్ కామెంట్**




బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల

**వికారాబాద్,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పేరు పెద్ద..ఊరు దిబ్బ అన్న చందంగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం నెలకొంది. కాగితాలకే పరిమతం అన్నట్లుగా బడ్జెట్ రూపొందించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సంబంధించిన వారే బడ్జెట్ సమావేశంపై పనికిమాలిని బడ్జెట్ సమావేశం అంటూ లూస్ కామెంట్ చేశారు. ఇది విన్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కాస్తా అవాక్కయ్యారు. ఆచరణ సాధ్యం కాని బడ్జెట్‌ను ఎందుకు ప్రవేశ పెట్టి, సభ్యులను ఎందుకు మభ్యపెట్టాలని కొందరు కౌన్సిల్ సభ్యులు నిట్టూర్చారు. తక్కువ బడ్జెట్ అయినా సరే ఆచరణ సాధ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అందరి శ్రేయస్కరమని పలువురు కౌన్సిల్ సభ్యులు ముచ్చటించుకున్నారు. చేసేదేమి లేక చైర్‌పర్సన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు అందరితో పాటు తలూపి మమః అనిపించారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వికారాబాద్ మున్సిపల్ 2024-25 సంవత్సరానికి గా ు అంచనా బడ్జెట్ ు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ప్రవేశపెట్టగా, ఈ బడ్జెట్ సమావేశానికి వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కౌన్సిల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ు సభ్యులు అందరు ఏకగ్రీవంగా ఆమోదించడంతో, కౌన్సిల్ సభ్యులు అందరికి చైర్ పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్ సమావేశం అనంతరం చైర్ పర్సన్ గారు మీడియాతో మాట్లాడుతూ, వికారాబాద్ మున్సిపల్ 2024-25 సంవత్సరానికి గా ు రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్ ు ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో ఖర్చులు రూ.66 కోట్ల, 72 లక్షలు పో ు.. మిగులు బడ్జెట్ రూ.26 లక్షల, 3 వేల ఉంటుందని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. వీటిలో మున్సిపల్ కు వచ్చిన ట్యాక్స్ లు రూ.10 కోట్లు, నాన్ ట్యాక్స్ లు రూ.10 కోట్ల,16 లక్షలు, డిపాజిట్స్, అడ్వాన్స్ లు రూ.45 లక్షలు, మున్సిపల్ గ్రాంట్ మొత్తం కలిపి రూ.46 కోట్ల,10 లక్షలు చూపించడం జరిగిందని అన్నారు. వేజెస్ అండ్ శాలరీలు రూ.5 కోట్ల, 85 లక్షలు, శానిటేషన్ పరంగా రూ.2 కోట్ల,54 లక్షలు, విద్యుత్ చార్జీలు రూ.కోటి,75 లక్షలు, లోన్స్ రూ.కోటి 10 లక్షలు, రూ.2 కోట్ల 26 లక్షల గ్రీన్ బడ్జెట్, మున్సిపల్ లోని అన్ని విభాగాలకు కలిపి మెయింటనెన్స్ చార్జీలు రూ.3 కోట్ల 22 లక్షలు, క్యాపిటల్ వర్క్స్ రూ.3 కోట్ల 69 లక్షలు, గ్రాంట్స్ రూ.46 కోట్ల 10 లక్షలు, డిపాజిట్లు రూ.45 లక్షలు కలిపి మొత్తం రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ప్రవేశ పట్టడం జరిగిందని చైర్ పర్సన్ వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ జాకిర్ అహ్మద్, కౌన్సిలర్లు, కో అపన్ సభ్యులు పాల్గొన్నారు.

### చీకోడ్ పాఠశాలలో స్వపరిపాలన

**పాపన్నపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా సిద్ధు, ఎంఈఓ గా రిషికేశ్, ప్రధానోపాధ్యాయులుగా అక్షితలు వ్యవహరించారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజనాచారి, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఆనందం జ్యోతి, పద్మ తదితరులు ఉపాధ్యాయులైన విద్యార్థులను పరిశీలించి అభినందించారు.

### కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు

**-విజేత కళాశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి**

**గజ్వేల్, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విజేత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి ఉమాదేవి తెలిపారు. శుక్రవారం ప్రజ్ఞా గార్డెన్‌లో విజేత డిగ్రీ కళా శాల 9వ వార్షికోత్సవం వేడుకలు, తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు.కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో, రాజకీయంగా స్థిరపడి తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆటల పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు, విద్యలో ఉత్తమ ప్రతిభ కన బర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్య క్రమం నిర్వహించారు.